



నృత్య ప్రదర్శనలో గుమ్మలక్ష్మీపురం కేజీబీవీ విద్యార్థినులు

మన్యం అభివృద్ధికి కృషి

- మంత్రి సంధ్యారాణి
- గిరిజన ప్రాంతాలపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి
- మౌలిక వసతుల కల్పనకు భారీగా నిధుల మంజూరు
- జిల్లాకేంద్రంలో జాతీయ జెండా ఆవిష్కరణ
- ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు



జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న మంత్రి సంధ్యారాణి, కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎస్పీ మాధవరెడ్డి, జేసీ శోభిక తదితరులు

పార్వతీపురం, ఆగస్టు15(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ప్రధానంగా గిరిజన ప్రాంతాలపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక దృష్టిసారించారన్నారు. శుక్రవారం పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఘనంగా పంద్రాగస్టు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు, పోలీసుల పరేడ్ వంటివి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తొలుత మంత్రి సంధ్యారాణి జాతీయ జెండా ఆవిష్కరించారు. పోలీసు దళాల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. 'ఏడాది కాలంగా ప్రజలకు మంచి పాలన అందిస్తూ సుపరిపాలనలో తొలి అడుగు వేశాం. సూపర్‌సిక్స్ హామీల అమలుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు తన అనుభవంతో చక్కని పరిపాలన అందిస్తున్నారు. రాష్ట్రాన్ని పెట్టుబడులకు నిలయంగా చేసి ప్రగతి పథంలో నడిపిస్తు న్నారు. పేదరికం నిర్మూలనలో భాగంగా బంగారు కుటుంబాల దత్తత కార్యక్రమాన్ని ఈ నెల 19న సీఎం లాంఛనంగా ప్రారంభించనున్నారు. సాలూరు మండలం జిల్లేడు వలస పంచాయతీ కార్యదర్శి మూడు కుటుంబాలను దత్తత తీసుకోవడం అభినందనీయం. సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి ఏడు సేవలను వాట్సాప్ గవర్నర్స్ ద్వారా అందనంగా ప్రజలు పొందొచ్చు. 'తల్లికి వందనం' పథకం కింద తల్లుల ఖాతాల్లో కోట్లాది రుపాయలు జమ చేశాం. అర్హులందరికీ ఎన్టీఆర్ భరోసా కింద సామాజిక పింఛన్లు అందిస్తున్నాం.' అని తెలిపారు.



ఆకట్టుకున్న పోలీస్ జాగిలం విన్యాసం

గిరిజన ప్రాంతాల ప్రగతికి నిధులు

'గిరిజన ప్రాంతాల్లో 373 పాఠశాలల అభివృద్ధికి రూ. 45 కోట్లు మంజూరు చేశాం. సన్న బియ్యం సరఫరా చేస్తూ విద్యార్థులకు రుచికరమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్నాం. గిరిజన యువతకు విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి ప్రాంతాల్లో స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసి ఉన్నత స్థాయి పోటీ పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నాం. గత మూడేళ్లుగా జిల్లా రాష్ట్రస్థాయిలో టెన్త్, ఇంటర్ ఫలితాల్లో ప్రథమ స్థానంలో నిలవడం ఆనందంగా ఉంది. జిల్లాలో మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు వ్యాపించకుండా స్ప్రేయింగ్ చేపడుతున్నాం. డ్రోన్ల ద్వారా యాంటీ లార్వా ఆపరేషన్ చేపడుతున్నాం. జిల్లాలో ఐదు కొత్త అంబులెన్స్‌లు ప్రారంభించాం. సాలూరు, భద్రగిరి, కురపాం ఆసుపత్రుల్లో అదనపు వసతుల ఏర్పాటు పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. సీతంపేట, పార్వతీపురం ప్రాంతాల్లో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి పనుల పూర్తికి రూ. 50 కోట్ల చొప్పున కూటమి ప్రభుత్వం విడుదల చేసింది. ఆశా వర్కర్ల సంక్షేమం కోసం ప్రభుత్వం మూడు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంది. అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం కింద జిల్లాలో 1,22,260 మంది రైతులకు తొలివిడతగా రూ.85 కోట్లు జమ చేశాం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 8,768 మంది కౌలు రైతులకు సీసీఆర్ కార్డులు మంజూరు చేశాం. పార్వతీపురంలో రూ.74 లక్షలతో జీడి ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభించాం. తోటపల్లి, వెంగళరాయసాగర్, పెద్దగెడ్డ ప్రాజెక్టుల ద్వారా పూర్తిస్థాయిలో సాగునీరు అందిస్తున్నాం. రూ.2.36 కోట్లతో అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాం. చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు నాణ్యమైన

(మిగతా 8వ పేజీలో...)



ప్రథమ బహుమతి సాధించిన ఐసీడీఎస్ శకటం



ద్వితీయ బహుమతి సొంతం చేసుకున్న విద్యాశాఖ శకటం



సీతంపేట కేజీబీవీ విద్యార్థినుల థింసా నృత్యం



భారీ జాతీయ జెండాతో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, అధికారులు

స్త్రీశక్తికి శ్రీకారం

- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు
- సాలూరులో ప్రారంభించిన మంత్రి సంధ్యారాణి

సాలూరు, ఆగస్టు15(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ హామీల్లో కీలకమైన స్త్రీశక్తి పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా శుక్రవారం సాలూరులో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆ పథకాన్ని ప్రారంభించారు. తొలుత పట్టణంలో తన నివాసం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు మహిళలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్సు ఎక్కి ఆధార్ కార్డు చూపించి జీరో ఫెయిర్ టిక్కెట్ తీసుకున్నారు. మహిళలు రాష్ట్రంలో ఎక్కడినుంచి ఎక్కడికైనా ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేయొచ్చన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున మహిళల కోసం 'స్త్రీ శక్తి' పథకం ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఆర్టీసీ డీఎం టీఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ.. సాలూరు ఆర్టీసీ డిపోలో ప్రస్తుతం 70 బస్సులు ఉన్నాయన్నారు. వాటిల్లో 58 పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్‌లు, 12 మాత్రమే అల్ట్రా డీలక్స్ బస్సులు ఉన్నాయని తెలిపారు. మరో 12 బస్సుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామన్నారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భంజ్‌దేవ్ మాట్లాడుతూ .. సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వానికి రానున్న స్థానిక ఎన్నికల్లో సైతం ప్రజలు పట్టం కట్టాలన్నారు. అనంతరం వారంతా రెండు బస్సుల్లో బోసుబొమ్మ కూడలి, డీలక్స్ సెంటర్, కోట దుర్గమ్మ గుడి, పెదకోమటిపేట, డబ్బీవీధి మీదుగా మామిడిపల్లి జంక్షన్ వరకు ప్రయాణించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి , టీడీపీ పట్టణ అధ్యక్షుడు తిరుపతిరావు (చిట్టి), నాయకులు యుగంధర్, పరమేశు, శోభారాణి, వైదేహి తదితరులు పాల్గొన్నారు



సాలూరులో బస్సు టికెట్ చూపుతున్న మంత్రి సంధ్యారాణి



కురుపాం: బస్సులో ప్రయాణిస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

హమ్మయ్యా.. బతికాం!

- బైక్‌తో సహా గెడ్డలో కొట్టుకుపోయిన వ్యక్తులు
- కాపాడిన యువకులు
- వంతెన నిర్మించాలని గిరిజనుల డిమాండ్

మక్కువ రూరల్, ఆగస్టు15 (ఆంధ్రజ్యోతి): దుగ్గేరు గ్రామం సమీపంలోని అడారి గెడ్డలో కొట్టుకుపోతున్న ఇద్దరు వ్యక్తులను స్థానిక యువకులు కాపాడి క్షేమంగా ఒడ్డుకు చేర్చారు. అయితే ఈ ఘటనలో వారి బైక్ మాత్రం వరద ఉధృతిలో కొట్టుకుపోయింది. వివరాల్లోకి వెళ్తే.. పనసభద్ర పంచాయతీ పరిధి గిరిశిఖర గ్రామం పొయ్యమాలకి చెందిన చోడిపిల్లి చంద్ర బైక్‌పై శుక్రవారం ఉదయం తన బంధువుతో కలిసి మక్కువ ప్రాంతానికి వెళ్లాడు. స్వాతంత్ర్యం దినోత్సవం సందర్భంగా గిరిజన హాస్టల్‌లో

(మిగతా 8వ పేజీలో...)



గెడ్డలో కొట్టుకుపోతున్న వ్యక్తులను కాపాడి ఒడ్డుకు తీసుకొస్తున్న యువకులు



చెరువు కాదండోయ్..

ఈ ఫొటో చూసి చెరువు అనుకుంటే పొరబడినట్టే. గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు గిజబ గ్రామంలోని పంట పొలాలు ముంపునకు గురై ఇలా చెరువును తలపిస్తున్నాయి. మండలంలోని తోటపల్లి, నందివానివలస, ఇటిక, తదితర ప్రాంతాల్లోని పామాయిల్, మామిడి, అరటి, వరి, కూరగాయల పంటలు కూడా నీట మునిగాయి. దీంతో రైతులు పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పంట పొలాల్లో చేరిన వర్షపు నీటిని మళ్లించేందుకు పడరాని పాట్లు పడుతున్నారు.

- గరుగుబిల్లి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి)

ఒట్టిగెడ్డలో పెరిగిన నీటి ప్రవాహం

- వర్షాల కారణంగా పోటెత్తుతున్న వరద

8లో

ఉత్తమ పాఠశాలలకు అవార్డులు

- సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రదానం

గుమ్మలక్ష్మీపురం/ సీతంపేట రూరల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పురస్కా రాలకు ఎంపికైన జిల్లాలో రెండు పాఠశాలలకు శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అవార్డులు అందించారు. గుమ్మలక్ష్మీపురం మండలం భద్రగిరి పీటీజీ బాలికల గురుకుల పాఠశాల, సీతంపేట ఐటీడీఏ పరిధి హడ్డుబంగి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలు ఏటా పదోతరగతి ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉత్తమ పాఠశాలలుగా అవి ఎంపిక య్యాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు ఎ.సత్యవతి, ఉమావాణి విజయ వాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం మైదానంలో సీఎం చేతుల మీదుగా అవార్డులు, ప్రశంసాపత్రాలు స్వీకరించారు. తమ పాఠశాలలకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు రావడంతో విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాళ్లు

శ్రావణ శోభ

- అమ్మవారి ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- అంతటా ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు



పాలకొండలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

పాలకొండ, ఆగస్టు15(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం నాలుగో శుక్రవారం సందర్భంగా జిల్లా వాసులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆలయాలకు క్యూ కట్టారు. ప్రధానంగా మహిళలు ఇళ్ల వద్ద విశేష పూజలు, వ్రతాలు చేశారు. ఆ తర్వాత దేవాలయాల్లో అమ్మవార్లను దర్శించుకుని సామూహిక కుంకుమార్చనలు చేశారు. ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పాలకొండ కోటదుర్గమ్మ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ప్రధాన అర్చకుడు డి.లక్ష్మీ ప్రసాదశర్మ ఆధ్వర్యంలో మహిళలు సామూహిక కుంకుమార్చనలు, లలితాసహస్ర నామార్చనలు నిర్వహించారు. అనంతరం వాహన పూజలు, విద్యాభ్యాసాలు, అన్నప్రాసన పెద్దఎత్తున చేపట్టారు. ఈవో వీవీ సూర్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



కోటదుర్గమ్మ

పశు అక్రమ రవాణా అడ్డగింత

- గోశాలకు ఆవుల తరలింపు

8లో

వెల్ఫేర్ కార్యదర్శి ఆత్మహత్య

- కొత్తవలసలో ఘటన

7లో

రేపు జిల్లా సాధన సమితి సమావేశం

8లో

- 29, 30 తేదీల్లో రాష్ట్ర మంత్రివర్గ ఉప సంఘం రాక
- ఉమ్మడి జిల్లాలో పర్యటన

ఉత్తమ సేవలకు గుర్తింపు

- 596 మందికి ప్రశంసాపత్రాలు
- మంత్రి, కలెక్టర్ చేతుల మీదుగా అందజేత

8లో


గరివిడి: తహసీల్దార్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు


ఎస్.కోట రూరల్: తహసీల్దార్ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి


రాజాం రూరల్: జాతీయ జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్


సంతకవిటి: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విన్యాసాలు చేస్తున్న విద్యార్థులు

మెరిసిన మువ్వన్నెల పతాకం

స్వాతంత్ర్య సంబరాలను జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యాసంస్థలలో ప్రజాప్రతినిధులు, అధికారులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. విద్యాసంస్థల్లో చిన్నారుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

-ఆంధ్రజ్యోతి బృందం


భోగాపురం: పార్టీ కార్యాలయ ఆవరణలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే నాగమాధవి


కొత్తవలస: కోర్టు వద్ద జెండా ఎగురవేస్తున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి విజయ్‌చందర్


డెంకాడ: జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కమాండెంట్ మల్లికా గార్గ్


గజపతినగరం: కోర్టు వద్ద జెండాను ఆవిష్కరించిన న్యాయాధికారి విజయ్‌రాజ్‌కుమార్

ముఖ్యమంత్రి ప్రతి హామీనీ అమలు చేస్తారు


ఎస్‌కోట రూరల్: టిక్కెట్లు ఇస్తున్న ఎమ్మెల్యే లలిత కుమారి


రాజాం: ఉచిత బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్


బొబ్బిలి: బస్సులో ప్రయాణిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన


పార్వతీపురంటౌన్: మహిళలతో బస్సులో ప్రయాణం చేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ఎస్.కోట రూరల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని కచ్చితంగా అమలు చేస్తారని శాసన సభ్యురాలు కోళ్ల లలితకుమారి అన్నారు. శుక్రవారం సాయంత్రం మహిళలకు ఉచిత ఆర్‌టీసీ ప్రయాణం కల్పించే 'స్త్రీశక్తి' పథకాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం మహిళా ప్రయాణికులతో కలిసి లక్కవరపుకోట వరకు ప్రయాణం చేశారు. వారికి జీరో టిక్కెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు పాల్గొన్నారు.


పాలకొండ: టికెట్ ఇస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

మహిళల్లో ఆనందం...

రాజాం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకం అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టడంతో మహిళా లోకం సీఎం చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతున్నారని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో స్త్రీశక్తి పథకం ద్వారా ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని ప్రారంభించారు. మహిళలకు జీరో ఫేర్ టిక్కెట్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా మమిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదే అన్నారు. దీనికి సంబంధించిన మొత్తాన్ని ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయుకులు గురవాన నారాయణరావు, లక్షుభుక్త ధనలక్ష్మి, దుప్పలపూడి శ్రీను, పిల్లా పత్యంనాయుడు, వంగా వెంకటరావు, శాసపు రాజేష్‌కుమార్, గార గున్నంనాయుడు, శాసపు రమేష్‌కుమార్, కోటగిరి నారాయణరావు, జొన్నాడ రంజిత్, మంతిన ఉషారాణి, కోటి రవీంద్ర, మెంటిడ పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పాలకొండలో...

పాలకొండ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, సబ్ కలెక్టర్ స్వప్నిల్ పవర్ జగన్నాథ్ స్త్రీశక్తి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు మహిళలతో ర్యాలీగా వచ్చారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్ మాట్లాడుతూ పాలకొండ ఆర్టీసీ డిపోలో 80 బస్సులు ఉన్నాయన్నారు. వీటిలో 60 బస్సులు మహిళల ఉచిత ప్రయాణానికి వినియోగిస్తున్నట్టు తెలిపారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి కోటదుర్గమ్మ ఆలయం వరకు మహిళలతో కలిసి ఉచిత బస్సు టికెట్‌ను పొంది ప్రయాణం చేశారు.

● కురుపాం, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శుక్రవారం కురుపాంలో జెండా ఊపి ప్రారంభించారు.

● పార్వతీపురంటౌన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): సమ సమాజ స్థాపనలో భాగస్వామిగా ఉన్న స్త్రీని గౌరవించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకాన్ని ఆయన ప్రారంభించారు. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌తో కలిసి పార్వతీపురం నుంచి నర్సిపురం గ్రామం వరకు బస్సులో ప్రయాణికులతో పయనించారు.

● బొబ్బిలి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకాన్ని బొబ్బిలిలో ఎమ్మెల్యే బేబీనాయన శుక్రవారం ప్రారంభించారు. బుడా ఛైర్మన్ తెంటు లక్ష్ము నాయుడు, మున్సిపల్ ఛైర్మన్ రాంబార్కి శరత్‌బాబు లతో పాటు కూటమి నాయకులు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. వీరంతా బస్సు ఎక్కి టికెట్ కొనుగోలు చేశారు. మున్సిపల్ ఛైర్మన్ రాంబార్కి శరత్‌బాబు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ డైరక్టర్ రౌతు రామ్మూర్తి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గెంబలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్నారు

ఇచ్చిన మాటను సీఎం చంద్రబాబు నిలబెట్టుకున్నారు. మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం కల్పించారు. చాలా ఆనందంగా ఉంది. దీనివల్ల ఆర్థిక భారం తగ్గుతుంది.

- బి.లావణ్య, పార్వతీపురం

రుణపడి ఉంటాం

మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణ సౌకర్యం కల్పించిన ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. స్త్రీశక్తి పథకంతో ఆర్థిక భరోసా ఇచ్చినట్టయ్యింది. ఏదేమైనా ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించడం హర్షణీయం.

వి.సరస్వతి, కొండాపురం, పాలకొండ మండలం

జాతీయ పతాకాలతో జిందాల్ నిర్వాసితుల నిరసన

ఎస్.కోట రూరల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): జిందాల్ నిర్వాసితులు శుక్రవారం జాతీయ జెండాలు పట్టుకొని నిరసన కార్యక్రమం చేపట్టారు. గిరిజన, హరిజనులమైన తాము న్యాయం కోసం పోరాడుతుంటే అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. సంస్థల ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదని, హక్కులు కోరుతున్నామని చెప్పారు. వీరికి ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మద్దతు తెలిపారు.



నిరసన తెలుపుతున్న జిందాల్ నిర్వాసితులు

చెరువును తలపించిన మెంటాడ రోడ్డు

గజపతినగరం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం కురిసిన భారీ వర్షంతో మెంటాడ రోడ్డు చెరువును తలపించింది. సుమారు గంటపాటు కురిసిన వర్షానికి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నీరు చేరింది. మామిడిబంద కాలనీలోని లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరింది. జాతీయ రహదారి నుంచి మెంటాడ రైల్వే గేటు వరకు వర్షపునీరు నిలిచిపోవడంతో వాహనదారుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. స్థానికులూ తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. రైతులు మాత్రం వర్షంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.


మెంటాడ రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

ఓం సదనంలో లక్ష కుంకుమార్చన

కొత్తవలస, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ మాసం నాలుగో శుక్రవారం సందర్భంగా మండలంలోని తుమ్మికాపల్లి గేట్ సమీపంలోనున్న ఓం సదనంలో లక్ష కుంకుమార్చనలు చేశారు. సదనం నిర్వాహకులు అంపోలు ఉమా మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో మహిళలతో కుంకుమ పూజలు చేయించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పసుపుకొమ్ములతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో అర్చకుడు కిరణ్ కుమార్ శర్మ, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రామలింగపురం గ్రామంలోనున్న శ్రీ ఉమారామలింగేశ్వర ఆలయంలో అర్చకుడు సాయి సత్యనారాయణ మహిళలతో కుంకుమార్చనలు చేయించారు. పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

గీతాశ్రమంలో...

రేగిడి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): దేవుదళ గీతాశ్రమంలో నాలుగో శ్రావణ శుక్రవారం సందర్భంగా సాముహిక కుంకుమార్చనలు చేశారు. గ్రామప్రతినిధి కెంబూరు సుధాకరరావు, గీతాశ్రమం కన్వీనర్ జి.దామోదర్ పాల్గొన్నారు.


గీతాశ్రమంలో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

క్రైం న్యూస్

వెల్ఫేర్ కార్యదర్శి ఆత్మహత్య


రాఘవాచారి (ఫైల్)

జియ్యమ్మవలస, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న ఘటన పార్వతీపురం పట్టణంలోని కొత్తవలసలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. జియ్యమ్మవలస మండల కేంద్రానికి చెందిన కడారి నాగభూషణ, ధనలక్ష్మి దంపతులు బంగారు వస్తువులు తయారు చేస్తూ జీవనం సాగిస్తుంటారు. వీరికి రాఘవాచారి(32) అనే కుమారుడు, లావణ్య అనే కుమార్తె ఉన్నారు. రాఘవాచారి పార్వతీపురం మున్సిపాలిటీలో వార్డు వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈయన తన తోటి ఉద్యోగులతో కలిసి కొత్తవలసలోని ఒక రూములో ఉంటున్నారు. ప్రతి శనివారం తన తల్లిదండ్రుల వద్దకు జియ్యమ్మవలస వచ్చి, తిరిగి సోమవారం డ్యూటీకి వెళ్తూ ఉంటారు. గత శనివారం రాకపోవడంతో తల్లిదండ్రులు రాఘవాచారికి ఫోన్ చేశారు. కానీ ఎటువంటి సమాధానం లేదు. దీంతో తోటి స్నేహితులకు ఫోన్ చేసి, అడిగారు. వారు మొదట ఒంట్లో బాగులేదని చెప్పారు. తర్వాత తాము లేని సమయంలో పురుగు మందు తాగాడని చెప్పారు. దీంతో తల్లిదండ్రులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. వారు వెంటనే తమ కుమారుడిని పార్వతీపురంలో సౌజన్య ఆసుపత్రికి, అక్కడ నుంచి విజయనగరంలో తిరుమల ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. రాఘవాచారి అక్కడ చికిత్స పొందుతూనే శుక్రవారం ఉదయం మృతిచెందారు. దీనిపై పార్వతీపురం పట్టణ ఎస్ఐ గోవిందరావును వివరణ కోరగా.. ప్రస్తుతం విజయనగరంలో పోస్టుమార్టం జరుగుతుందని, తర్వాత వారి కుటుంబ సభ్యులు వచ్చి ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

కొమరాడ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. మండలంలోని విక్రంపురం గ్రామానికి చెందిన ఉబ్బిశెట్టి చిట్టిబాబు(60) శుక్రవారం తన ఇంట్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో విద్యుత్ మీటర్ వద్ద మరమ్మతులు చేస్తుండగా.. షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందారు. ఈయన భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఈయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు ప్రైవేటు ఉద్యోగం చేస్తుండగా, కుమార్తెకు వివాహం అయ్యింది.

భవనం పైనుంచి పడి తాపీమేస్త్రి మృతి

మెంటాడ, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): మెంటాడ మండల కేంద్రంలో శుక్రవారం ప్రభుత్వ హైస్కూల్ భవన నిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తూ ఓ తాపీ మేస్త్రీ మృతిచెందాడు. శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం అడపాక గ్రామానికి చెందిన గురజాపు అప్పారావు (32) అనే తాపీ మేస్త్రి భవనం పై నుంచి జారిపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనను వెంటనే గజపతినగరం ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఆంధ్ర ఎస్ఐ సీతారాం తెలిపారు.

బెల్ట్ దుకాణంపై దాడి

భోగాపురం, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): రావాడ గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ దుకాణంపై దాడి చేసి గ్రామానికి చెందిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వి.రవికుమార్ శుక్రవారం తెలిపారు. ఈదాడిలో 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఈ దాడిలో ఎస్ఐ చంద్రమోహన్, హెచ్‌సీ ప్రతాప్, రామారావు, మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీకృష్ణాష్టమి వేడుకలు

వేపాడ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): వేపాడలోని శ్రీరుక్మిణీ సమేత గోపాలకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో శనివారం నుంచి మూడురోజుల పాటు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ఆది వారం మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించనున్నట్టు వారు తెలిపారు.


పూజలు అందుకోనున్న శ్రీకృష్ణుడు

ఉత్తమ అధికారులకు ప్రశంసలు

పార్వతీపురం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ సేవలు అందించిన పలువురు అధికారులు, సిబ్బంది స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు. పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ఎమ్మెల్యే విజయచంద్ర, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ మాధవరెడ్డి చేతులమీదుగా వీటిని అందజేశారు. ప్రత్యేక మెడల్స్ కాకుండా సుమారు 596 ప్రశంసాపత్రాలను అందించారు. జేసీ శోభిక, సబ్ కలెక్టర్ వైశాలి పాల్గొన్నారు.



కె.హేమలత, డీఆర్వో | పి.ధర్మచంద్రారెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ | రాబర్ట్‌పాల్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి | మన్మథరావు, జిల్లా పశు సంవర్ధశాఖ అధికారి | కె.రామచంద్రరావు, డ్వామా పీడీ



మంత్రి సంధ్యారాణి చేతులమీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న జేసీ ఎస్.శోభిక



ఎం.సుధారాణి, డీఆర్‌డీఏ పీడీ | ఎస్.భాస్కరరావు, డీఎంహెచ్‌వో | జి.నాగభూషణరావు, డీసీహెచ్ఎస్ | ఎల్.రమేష్, డీపీఆర్వో | టి.కనకదుర్గ, ఐసీడీఎస్ పీడీ | ఆర్.గెడ్డమ్మ, బీసీ కార్పొరేషన్ ఈడీ | టీవీ తిరుపతిరావు, సీఐ, చినమేరంగి | వినోద్‌కుమార్, జిల్లా ప్రోగ్రాం అధికారి | ఎల్.రఘుకుమార్, డీపీఎంవో | జగన్మోహన్, ప్రోగ్రాం అధికారి, ఎన్‌సీడీ | రమణ కుమార్, జిల్లా కన్సలటెంట్, పబ్లిక్ హెల్త్ | జి.శ్రీరామూర్తి, సూపరింటెండెంట్



పీఎస్ లక్ష్మీకుమార్, డీటీ, కలెక్టర్ ఆఫీస్ | శివ జగన్మోహనరావు, సీసీ టూ కలెక్టర్ | కె.ఆదిత్య, జేపీసీసీ డీసీఎం | తిరుపతిరావు, ఏఈ, ఐటీడీఏ | ప్రసాద్, ఏఏవో, ఐటీడీఏ | ఎం.పురుషోత్తం, సీసీ టూ సీడీఎం, కలెక్టర్ ఆఫీస్ | కొండలరావు, రెడ్ క్రాస్ సొసైటీ మెంబర్ | కె.చంద్రబాబు, ఏటీడబ్ల్యూవో | జి.నవీన్, సీసీ టూ జాయింట్ కలెక్టర్ | రాజు, సీసీ టూ ప్రోజెక్టు అధికారి | చంద్రమౌళి, ఏఈఈ పంచాయతీరాజ్ | కృష్ణారావు, మండల ఇంజనీరింగ్ కన్సల్టెంట్

మన్యం అభివృద్ధికి కృషి

(5వ పేజీ తరువాయి)

పౌష్టికాహారాన్ని అందిస్తున్నాం. రూ.3.63 కోట్లతో బీసీ కార్పొరేషన్ ద్వారా 15 కుట్టు శిక్షణకేంద్రాలు ఏర్పాటు చేశాం. వాటి ద్వారా 1454 మందికి శిక్షణ అందిస్తున్నాం. దీపం-2 పథకం కింద మూడు లక్షల మంది లబ్ధిదారులకు ఉచితంగా గ్యాస్ సిలిండర్లను అందజేస్తున్నాం. ఇప్పటివరకు సబ్సిడీ కింద రూ.23.62కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. రాష్ట్రంలో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి రూ.7,500 కోట్లు, రహదారుల నిర్మాణానికి రూ.1300 కోట్లు కేటాయించాం. జిల్లాలో చిలకమున్నింగి రోడ్డు పనులకు రూ.2.50 కోట్లు మంజూరు చేశాం. ఆది కర్మయోగి పథకం కింద గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక తయారు చేస్తున్నాం. రానున్న మూడేళ్లలో 320 అనుసంధాన రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. ఇందులో భాగంగానే 575 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణానికి రూ.610 కోట్లతో ప్రణాళికలు రూపొందించాం. రూ.10 కోట్లతో పూర్ణపాడు- లాబేసు వంతెన పనులు నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఏజెన్సీ ప్రాంతాల్లో యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. సీతంపేట గిరిజన మ్యూజియం పూర్తికి, ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్ విస్తరణ పనులకు ప్రభుత్వం రూ.2.50 లక్షలు మంజూరు చేసింది. రాష్ట్రంలో 13,816 గిరిజన గ్రామాల్లో తాగునీరు సరఫరా కోసం రూ.రెండు వేల 373 కోట్లతో జలజీవన్ మిషన్ పనులు జరుగుతున్నాయి. జిల్లాలో రెండు గిరి బజార్ సంచాలర వాహనాలు ప్రారంభించాం. రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో జిల్లా విజేతగా నిలవడం ఆనందంగా ఉంది. మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తాం. అని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ మాధవరెడ్డి, జేసీ శోభిక, సబ్ కలెక్టర్ వైశాలి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

పార్వతీపురం టౌన్: గుమ్మలక్ష్మీపురం, సీతానగరం, సీతంపేట, గరుగుబిల్లి కేజీబీవీ, పార్వతీపురం కొత్తవలస కొత్తపోలమ్మ, తీరుమళ్ల రామ్మూర్తి మున్సిపల్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. నృత్య ప్రదర్శనలు, థింసా డ్యాన్సులు, పిరమిడ్ విన్యాసాలతో ఆకట్టుకున్నారు. అనంతరం మంత్రి వారికి బహుమతులు అందజేశారు. మరోవైపు జిల్లా వృత్తివిద్యాశాఖాధి కారి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు 150 అడుగుల భారీ జాతీయ జెండాను ప్రదర్శించారు. ఇక స్వాతంత్య్ర వేడుకల్లో ప్రభుత్వ శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఐసీడీఎస్, విద్యాశాఖ , గ్రామీణ నీటి సరఫరా శాఖల శకటాలు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను సొంతం చేసుకున్నాయి.

హమ్మయ్యా.. బతికాం!

(5వ పేజీ తరువాయి)

చదువుతున్న తమ పిల్లలను చూసి సాయంత్రం తిరిగి స్వగ్రామానికి బయల్దేరాడు. మార్గమధ్యలో అడారి గెడ్డపై ఉన్న కాజ్‌వేను దాటి వెళ్లేందుకు ప్రయత్నించాడు. అయితే గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు ఒక్కసారిగా అక్కడ వరద ఉధృతి పెరిగింది. దీంతో వారు అదుపు తప్పి గెడ్డలో జారిపడ్డారు. బైక్‌తో సహా కొంతదూరం కొట్టుకుపోయారు. ఇది గమనించిన గుంటభద్ర గ్రామానికి చెందిన యువకులు ఒక్కసారిగా గెడ్డలోకి దూకి వారిద్దరినీ కాపాడారు. క్షేమంగా ఒడ్డుకు చేర్చడంతో అక్కడకున్నవారంతా ఊపిరిపీల్చుకున్నారు. గాయాలేమీ కాకపోవడంతో వారు వేరే వాహన సాయంతో ఇళ్లకు చేరారు. కాగా గుంటభద్రతో మరో పలు గ్రామాల గిరిజనులు అడారు గెడ్డపై తాడును కట్టి ఒక్కొక్కరుగా కాజ్‌వేను దాటి ఇళ్లకు చేరుకున్నారు. ఏటా వర్షాకాలంలో తమకి ఈ ఇబ్బందులు తప్పడం లేదని, తక్షణమే ఈ ప్రాంతంలో వంతెన నిర్మించాలని వారు కోరుతున్నారు.

సేవలకు గుర్తింపు



మంత్రి సంధ్యారాణి నుంచి ప్రశంసా పత్రాలు అందుకుంటున్న రాంబాబు, పద్మావతి

పాలకొండ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విజయ ఆసుపత్రి ఎండీ దూబ పద్మావతి, ఉమ్మడి విజయనగరం జిల్లా ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ దూబ రాంబాబుల సేవలకు గుర్తింపు లభించింది. శుక్రవారం పార్వతీపురంలో జరిగిన స్వాతంత్య్ర దినోత్సవంలో రాష్ట్ర గిరిజన శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ చేతులమీదుగా వీరు ప్రశంసా పత్రాలు అందుకున్నారు. వీరికి పలువురు అభినందనలు తెలిపారు.

కూచిపూడిలో ఐతిహ్యకు..

పాలకొండ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): పాలకొండకు చెందిన కొండదాడి ఐతిహ్య కూచిపూడి కళా రంగంలో విశేష సేవలకు గుర్తింపు లభించింది. శుక్రవారం పార్వతీపురంలో నిర్వహించిన స్వాతంత్య్ర వేడుకల్లో కూచిపూడి నాట్యంలో విశేష ప్రతిభ కనబరిచిన ఐతిహ్యను రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సత్కరించారు. ఐతిహ్య 11 సంవత్సరాల వయస్సులో 300కు పైగా కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు ఇవ్వడం ప్రశంసనీయమన్నారు. మరిన్ని ప్రదర్శనలు చేసి జాతీయ స్థాయిలో ప్రశంసలు పొందాలని ఆకాంక్షించారు.



ప్రశంసా పత్రం అందుకుంటున్న ఐతిహ్య

ఘనంగా స్వాతంత్య్ర దినోత్సవం

- వాడవాడలా రెపరెపలాడిన మువ్వన్నెల జెండా
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, నాయకులు

స్వాతంత్య్ర దినోత్సవాన్ని శుక్రవారం పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల వద్ద జాతీయ జెండాను ఎగురవేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొని, జెండాను ఆవిష్కరించారు. స్వాతంత్య్ర సమరయోధుల సేవలను కొనియాడారు. ఈసందర్భంగా విద్యార్థులు చేపట్టిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

(ఆంధ్రజ్యోతి బృందం)



పార్వతీపురంటౌన్: మున్సిపల్ కార్యాలయం వద్ద జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర



కురుపాం: అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి



పార్వతీపురం: జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



భామిని: మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ



పార్వతీపురంటౌన్: జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి



సీతంపేట రూరల్: నృత్యం చేస్తున్న గిరిజన విద్యార్థులు



మక్కువ రూరల్: అనసభద్ర ఏకలవ్య పాఠశాలలో..



గరుగుబిల్లి: కేజీబీవీ విద్యార్థినుల పిరమిడ్ విన్యాసాలు



తృతీయ బహుమతి సాధించిన గ్రామీణ నీటి సరఫరా శాఖ శకటం



సాలూరు: జెండా ఆవిష్కరిస్తున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి హర్షవర్ధన్



పాలకొండ: సబ్‌జైలులో జాతీయ జెండాను ఎగురవేస్తున్న న్యాయాధికారి సీహెచ్ హరిప్రియ



పాలకొండ: గౌరవ వందనం చేస్తున్న సబ్ కలెక్టర్ స్వప్నిల్ పవర్ జగన్నాథ్



పార్వతీపురం: జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న సబ్ కలెక్టర్ వైశాలి



కురుపాం రూరల్: జెండా ఎగురవేస్తున్న న్యాయాధికారి సౌమ్యా జోస్ఫిన్

రేపు జిల్లా సాధన సమితి సమావేశం

పాలకొండ, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): పాలకొండ జిల్లా సాధన సమితి విస్తృత స్థాయి సమావేశం ఈనెల 17న సాయంత్రం శ్రీఅయ్యప్ప శంకర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తామని ఆ సమితి సభ్యులు తెలి పారు. వారు శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. ఈనెల 29, 30 తేదీల్లో రాష్ట్ర మంత్రివర్గ ఉప సంఘం ఉమ్మడి జిల్లా శ్రీకాకుళం రానున్న సందర్భంగా పాలకొండ ప్రాంత అన్ని వర్గాల అభిప్రాయాలు, సూచనలు, సలహాలు స్వీకరించడం కోసం ఈ సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

ఒట్టిగెడ్డలో పెరిగిన నీటి ప్రవాహం

వీరఘట్టం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం పక్కన ఉన్న ఒట్టిగెడ్డలో శుక్రవారం నీటి ప్రవాహం పెరిగింది. గత కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో కొండ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున నీరు వచ్చి గడ్డలో కలుస్తోంది. దీంతో నీటి ప్రవాహం పెరిగింది.

తోటపల్లిలో తగ్గుతున్న వరద

గరుగుబిల్లి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదికి వరద ప్రవాహం తగ్గు ముఖం పడుతోంది. శుక్రవారం పై ప్రాంతం నుంచి నదిలోకి సుమారు 3,800 క్యూసెక్కుల వరద నీరు చేరుతుంది.

పశువుల అక్రమ రవాణా అడ్డగింత

సీతంపేట రూరల్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి రాజాం ప్రాంతానికి వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న ఎనిమిది గోవులను పోలీసులు రక్షించారు. ఎస్ఐ వై.అమ్మనరావు ఆధ్వర్యంలో శుక్రవారం పోలీసు సిబ్బంది పీఎంఆర్‌సీ కేంద్రం వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఆవులను తరలిస్తున్న వ్యానును పట్టుకుని, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి, ఆవులను గోశాలకు తరలించారు.

మద్యం సీసాల స్వాధీనం

కురుపాం, ఆగస్టు15(ఆంధ్రజ్యోతి): కురుపాంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న జి.శ్రీధర్ అనే వ్యక్తిని పట్టుకుని, 12 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం నిర్వహించిన దాడుల్లో శ్రీధర్ పట్టుబడినట్టు చెప్పారు.

వైభవంగా శ్రావణ శుక్రవారం పూజలు


శ్రావణ శుక్రవారం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్లు విశేష అలంకరణలో దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



సాలూరు/ రూరల్: పూజలు చేస్తున్న మహిళలు



పాలకొండ: నక్కలపేటలో మహాలక్ష్మీ రూపంలో అమ్మవారు



సాలూరు రూరల్: బంగారు చీరలో వాసవీమాత



వీరఘట్టంలో..



మక్కువ రూరల్: శంబరలో..

వారి త్యాగాలే మనకు స్వేచ్ఛా వాయువులు

రాయగడ, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): 'స్వాతంత్య్ర సమర యోధుల త్యాగాలే మనకు స్వేచ్ఛా వాయువుల'ని రాష్ట్ర మత్స్య, పశు సంవర్ధక శాఖా మంత్రి గోకులానంద్ మల్లిక్ అన్నారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో స్థానిక జీసీడీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన 79వ స్వాతంత్య్ర దినోత్సవంలో

ఒడిశా

ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, ప్రశం గించారు. తొలుత పతాకావిష్కరణ చేసి, 36 ప్లాటూన్ల నుంచి గౌరవ వందన స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలను వివరించారు. విద్యార్థులు నృత్యాలు చేశారు.



ప్రసంగిస్తున్న మంత్రి మల్లిక్

భామినిలో వర్షం

భామిని, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది.